క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం, అగసలదిన్నె, సుళేకేరి గ్రామ శివారులోని బుడుములదొడ్డి, ఎరిగేరిలోని పులిగట్టు వీరాంజనేయ స్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు సందడిగా మారాయి.

శ్రీమఠంలో డీఐజీ


స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న వెంకటేశ్వర్లు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామిని ఏపీఎస్పీ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పీఠాధిపతి ఆశీర్వదించారు. ఆయనతో పాటు మఠం మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఉన్నారు.

నివారణ చర్యలతో టీబీ నయం


పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఆదోనిటౌన్: ఆరోగ్య నియమాలు, జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని నయం చేసుకోవచ్చని డాక్టర్ బాలమురళీక్రిష్ణ, సూపర్‌వైజర్ బాబురాజు తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ వద్ద పవర్‌గ్రిడ్ సహకారంతో 120 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలమురళీకృష్ణ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని పూర్తిగా నయం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ఖరీదైన మందులను అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సిద్ధమ్మభాయి, పద్మావతి, వీరేష్, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు ముమ్మర ఏర్పాట్లు


మైదానాన్ని చదును చేయిస్తున్న సర్పంచ్

కౌతాళం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పోటీల కోసం మండల పరిధిలోని ఎరిగేరి జెడ్పీ పాఠశాల మైదానాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. శనివారం గ్రామ సర్పంచ్ గోవిందు మైదానంలో గుంతలు ఉన్న చోట గ్రావెల్‌తో చదును చేయించారు.

పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

పెద్దకడుబూరు: మండల పరిధిలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 'పల్నాడు బాలోత్సవంలో ప్రాస పద గేయాలు' అనే పుస్తకాన్ని శనివారం పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో ఆవిష్కరించారు. గద్వాల సోమన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్, బాలోత్సవం కమిటీ నిర్వాహకులు కట్టా కోటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చిన రామిరెడ్డి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ పుస్తకాన్ని సోషల్ వర్కర్, విద్యాదాత శ్రీనివాసరావుకి అంకితమిచ్చినట్లు పేర్కొన్నారు. అనతి కాలంలోనే 45 పుస్తకాలను ప్రచురించడమే కాకుండా బాలసాహిత్యంలో విశిష్ట సేవలకు ముఖ్య అతిథులు కొనియాడారు. కార్యక్రమంలో కవులు, ఉపాధ్యాయులు రాగినేని వేములయ్య, మాన్సింగ్, రవికృష్ణ పాల్గొన్నారు.

20 గొర్రెలు మృత్యువాత

తుగ్గలి: పురుగు మందు నీళ్లు తాగి గొర్రెలు మృతి చెందిన ఘటన శనివారం ఎద్దులదొడ్డిలో జరిగింది. గ్రామానికి చెందిన హనుమంతు తన గొర్రెలను సమీపంలోని ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. బావి ఒడ్డున ఉన్న పురుగు మందు కలిపిన బకెట్‌లో నీటిని గొర్రెలు తాగాయి. దీంతో 20 గొర్రెలు మృతి చెందాయి.

ఆరోగ్య సంజీవని @108

- ప్రాణాలు కాపాడుతున్న 108 అంబులెన్స్‌లు
- అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు
- వాహనాలు, కి.మీ పరిధిని భారీగా పెంచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అత్యాధునిక సదుపాయాల కల్పన
- గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొండంత భరోసా

పల్లె, పట్టణం, వీధి, వాడ, ఏదైనా సరే చిన్నపాటి ప్రమాదం జరిగినా సమాచారం అందుకున్న క్షణాల్లోనే కుయ్ కుయ్ అంటూ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎక్కించుకుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రానికి చేరవేస్తూ ప్రాణాలను కాపాడుతోంది 108 వాహనం. ప్రమాదాలు, కాన్పులు, గుండె జబ్బులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను క్షణాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు పోస్తూ ఆరోగ్య సజీవనిగా నిలుస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత గల వాహనాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. వాహనాల్లో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేసి వాటి సంఖ్యను సైతం భారీగా పెంచింది.


108 అంబులెన్స్


వాహనంలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు


ప్రసవం చేసిన ఈఎంటీ (ఫైల్‌ఫోటో)

ఆదోనిటౌన్: సమయానికి ఆస్పత్రికి వెళ్లలేక ఏ ఒక్క ప్రాణం పోకూడదన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108 వాహనాలను తీసుకొచ్చారు. ఈ వాహనాలు ఎందరి ప్రాణాలనో కాపాడగలిగాయి. అయితే గత టీడీపీ ప్రభుత్వం 108 వాహనాలను నిర్లక్ష్యం చేసింది. నిర్వహణ లోపంతో చాలా వాహనాలు మూనలపడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. పాత వాహనాలకు తోడు కొత్తగా 2 వేల అంబెలెన్స్‌ను సమకూర్చింది. ప్రజల ప్రాణాలకు భరోసా కల్పిస్తోంది.

క్షణాల్లో వైద్య సేవలు

ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చిన్నపిల్లలకు ఒక అంబులెన్స్, పెద్దలు, జనరల్ కేసులకు సంబంధించి మరో 108 అంబులెన్స్‌ను కేటాయించారు. సమాచారం అందుకున్న క్షణాల్లోనే బాధితుల దగ్గరకు వెళ్లి ఈఎంటీ, పైలట్, క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లోకి ఎక్కించుకుని ఆస్పత్రులకు చేరవేస్తున్నారు. సకాలంలో వైద్యం పొందే అవకాశం లభిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సేవల విస్తరణ

పేదలు రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. 3,257 ప్రొసీజర్‌లతో రూపకల్పన చేశారు. రూ.5 లక్షల ఉన్న పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ఎలాంటి జబ్బుకైనా కార్పొరేట్ వైద్యం పొందే అవకాశం లభించింది.

150 కి.మీ. పరిధి

108 అంబులెన్స్‌ల పరిధి 20 నుంచి 30 కి.మీ. ఉండేది. ఏ ఒక్కరి ప్రాణాలకు హాని కలగకూడదని భావించిన జగనన్న ప్రభుత్వం అంబులెన్స్‌ల పరిధిని 150 కి.మీ. వరకు విస్తరించింది. నేడు ఆదోని నుంచి కర్నూలుకు 108 అంబులెన్స్‌లలోనే రోగులను తరలిస్తున్నారు. గతంలో ప్రైవేట్ అంబులెన్స్‌లకు వేలకు వేలు ఖర్చు చేసే పరిస్థితి ఉండేది. కర్నూలు వరకు అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొండంత ధైర్యాన్ని ఇస్తోంది.

రోజుకు నాలుగు కేసులు

రోజులో ఒక్కో అంబులెన్స్ నాలుగు కేసుల చొప్పున ఏరియా ఆస్పత్రి, మాతాశిశుసంరక్షణ కేంద్రం నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. నెలకు 150 నుంచి 200 దాకా కేసులు నమోదవుతున్నాయి. ఆదోని నుంచి కర్నూలు, బళ్లారి, రాయచూరు ప్రాంతాలకు రోగులను 108 అంబులెన్స్‌లోనే తరలిస్తున్నారు. ఇలా నెలకు మొత్తం 2400 కేసులు నమోదవుతున్నాయి. నాలుగన్నరేళ్లలో ఒక్కో అంబులెన్స్ 10 వేల నుంచి 11 వేల వరకు క్షతగాత్రులను తరలించాయి. ప్రజల మన్ననలను పొందుతున్నాయి.

సేవలు ఇలా..

108 అంబులెన్స్‌లో కాన్పులు, గర్భిణులకు పరీక్షలు, రోడ్డు ప్రమాదాల కేసులు, వివిధ కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వారు, గొడవల్లో గాయపడిన వారిని, గుండె జబ్బులకు సంబంధించిన వ్యాధిగ్రస్తులను కర్నూలు, బళ్లారి, రాయచూరుకు తరలిస్తారు. పసికందులను మాతాశిశు సంరక్షణ కేంద్రానికి పంపుతారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉంటే అక్కడి నుంచి కర్నూలుకు తరలిస్తారు. 108లో రోగులకు అనుగుణంగా సౌకర్యాలు ఉన్నాయి. ఈఎంటీ, పైలెట్ ఉంటారు. కర్నూలుకు రోగులను తరలిస్తుండగా మార్గమధ్యలో ఇబ్బందులు తలెత్తితే ఈఎంటీ ప్రథమ చికిత్స అందిస్తారు.

సకాలంలో ఆస్పత్రికి వెళ్లగలిగాం



నా కుమార్తె లలితమ్మకు ఆస్పరి ప్రభుత్వ ఆస్పత్రిలో 2వ కాన్పు అయ్యింది. అయితే మగబిడ్డకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో 108 అంబులెన్స్‌లో పైసా ఖర్చు లేకుండా సకాలంలో ఆదోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లగలిగాం. మూడు రోజులు వైద్యం చేశారు. ప్రస్తుతం పసిబిడ్డ కోలుకున్నాడు. 108 అంబులెన్స్ వల్లే సమయానికి ఆస్పత్రికి వెళ్లాం. చాలా సంతోషంగా ఉంది.

–లక్ష్మి, ఆస్పరి

70 కి.మీ. ప్రయాణం



నా కుమార్తె భాగ్యలక్ష్మి మొదటి కాన్పు సమయంలో ఆదోనికి వెళ్లడానికి 108కు సమాచారం అందించిన వెంటనే ఇంటి వద్దకు వాహనం వచ్చింది. అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆదోని మాతాశిశుసంరక్షణ కేంద్రానికి వెళ్లాం. రాను పోనూ 70 కి.మీ అయ్యింది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కుటుంబ సభ్యులను ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మల్లికార్జున, కౌతాళం గ్రామం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగంలో నియామకం

ఆదోనిటౌన్: ఆదోని నియోజకవర్గంలో మండల, మున్సిపాలిటీలో యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోని మున్సిపాలిటీ క్లస్టర్–1 యువజన విభాగం అధ్యక్షుడిగా మనియార్ అబ్దుల్‌హఫీజ్ అస్లాంమనియార్, క్లస్టర్–2 అధ్యక్షుడిగా ఈడిగ ఉదయ్‌శేఖర్, మండల యువజన అధ్యక్షుడిగా ఎం.వెంకటేశులును నియమించింది. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇవ్వడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేద్దాం

మంత్రాలయం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి కోరారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, ఏపీఎం జయశ్రీ, ఎంఈఓ మెయినుద్దీన్, విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రానెట్ క్వారీపై అధికారుల దాడులు

కర్నూలు (న్యూటౌన్): పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో సర్వే నంబర్ 38లో అక్రమంగా రాత్రిపూట గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో క్వారీలో తవ్వకాలు సాగిస్తున్న హిటాచీని సీజ్ చేశారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ తాడిపత్రికి చెందిన దూదేకుల మహమ్మద్ రఫీ రాత్రిపూట అక్రమ క్వారీ నిర్వహిస్తున్నాడని విచారణలో తేలిందన్నారు. హిటాచీ కంప్రెజర్‌ను పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవనకొండలో డెంగీ కేసు నమోదు


పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ: మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ కళ్యాణ్ తెలిపారు. శనివారం వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమకు సంబంధించిన లార్వా గుర్తించి, దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది చేత పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థినుల ప్రతిభ


ట్రోఫీ అందుకుంటున్న ఆలూరు విద్యార్థినులు

ఆలూరు: జోనల్ స్థాయి ఖోఖో, వాలీబాల్, టెన్నిస్ బాల్ క్రీడల్లో ఆలూరు గురుకులం విద్యార్థినులు ప్రతిభ చూపారు. రెండు రోజుల నుంచి రేణిగుంట గురుకుల పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ఖోఖోలో కదిరి, వాలీబాల్‌లో వైఎస్సార్ జిల్లా రాయచోటి, టెన్నిస్‌బాల్‌లో చిత్తూరు జట్లపై ఆలూరు గురుకులం విద్యార్థినుల జట్లు విజయం సాధించి శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నట్లు పాఠశాల పీఈటీ ప్రతాప్ తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ షాహినూరు, ఉపాధ్యాయులు తదితరులు అభినంచారు.

నేడే కురువ మహా సింహగర్జన సభ


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న శశికళ, కృష్ణమోహన్

ఆలూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణం వెనుక మైదానంలో ఆదివారం మాదాసి/మాదారి కురువల మహా సింహ గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బళ్లారి జిల్లా మాజీ డిప్యూటీ మేయర్ శశికళ తెలిపారు. సభ ఏర్పాట్లను శనివారం నాయకులు కృష్ణమోహన్ తదితరులతో కలిసి ఆమె పరిశీలించారు. ఏపీలోని వివిధ జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు హాజరు కానున్నట్లు శశికల తెలిపారు.


ముస్తాబైన ఆదోని చర్చి

చర్చీలకు క్రిస్మస్ శోభ


ఆదోని: ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్టింగ్

ఆదోనిసెంట్రల్/కౌతాళం: ఆదోని పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రీస్తు జననానికి సంబంధించిన సెట్టింగ్ ఆకట్టుకుంది. అలాగే కౌతాళం మండలం ఏరిగేరిలోని సీఎస్ఐ చర్చి, కౌతాళంలోని ఈఎస్ఐ, సీఎస్ఐ చర్చి, హల్వి, బాపురంలోని చర్చి, కామవరం, చూడి, బంటకుంట, సుళేకేరి, ఉరుకుంద, బదినేహాల్, ఉప్పరహాల్ గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో సుందరంగా దర్శనమిస్తున్నాయి. క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలను ఏర్పాటు చేశారు.


ఆర్‌సీఎం చర్చి


కౌతాళం: విద్యుత్ అలంకరణలో బాపురం చర్చి

వైకుంఠ దర్శనం.. సకల పాపహరణం

- భక్తులతో కిక్కిరిసిన వైష్ణవ ఆలయాలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- ఉత్తర ద్వార దర్శనంతో పునీతం


మంత్రాలయం: ఆకట్టుకున్న కోలాటాలు




పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి,కోసిగి: ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు, హారతి తీసుకుంటున్న భక్తులు

మంత్రాలయం: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంత్రాలయం మండల కేంద్రంలో కొలువైన వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆలయంలో వైకుంఠ ద్వార ప్రవేశం గావించి ఏకాదశి వేడుకలకు అంకుర్పారణ పలికారు. శ్రీదేవిభూదేవి సమేత శ్రీవారికి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం ముక్కోటి ఏకాదశి పవిత్రతను భక్తులకు వివరించారు. క్షేత్రంలో పుష్పాలంకరణ, కోలాటాలు, హరిదాస కీర్తనలు, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, మేనేజర్ వెంకటేష్ జోషి పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: ఆదోనిలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారం మీదుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఇందిరానగర్ ఉప్పరవీధిలోని భూదేవిశ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో వేకువ జాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాముడు, ఉపాధ్యక్షుడు ఈరన్న, సభ్యులు శ్రీనివాసులు, శాంతమూర్తి, రాజశేఖర్, విజయ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోసిగి: పాపయ్య కొండ సమీపంలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలపుష్పాలు, మహా మంగళ హారతులు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఉత్తర ద్వార ద్వారం మీదుగా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాస నంద స్వామిజీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంఈఓ కె.నాగేశప్ప స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్


ప్రయోగాలను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోనిసెంట్రల్: ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని అక్షర పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదోనిలోని పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 23 మంది విద్యార్థులు వివిధ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి 500 ప్రాసెస్‌లను ఆవిష్కరించారని కరస్పాండెంట్ తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు 200 ప్రాజెక్టులను చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మేఘనాథ్‌రెడ్డి, హెచ్ఎం రాఘవేంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ఎగ్జిబిట్లు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సామ్యూల్‌పాల్

ఘనంగా సెమీ క్రిస్మస్

కోసిగి: స్థానిక మౌంట్ కార్మెల్ స్కూల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జిల్లా సహాయ విద్యాధికారి సామ్యూల్ పాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్ అంటే సంతోషం, ప్రేమ, దయ, కరుణతో కలిపి జరుపుకునే గొప్ప పండుగ అన్నారు. సాటి మనిషిని ప్రేమించడమే ఏసుతత్వం అని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జాన్సన్, ఓర్వకల్లు, క్రిష్ణగిరి మండలాల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జోషిలా, నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా భగవద్గీత జయంతి వేడుకలు


గీతా సారాంశాన్ని వివరిస్తున్న శివాయోగానందస్వామి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గీతామందిరంలో శ్రీభగవద్గీత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం మందిరంలో కొలువుతీరిన శ్రీకృష్ణుడికి కర్ణాటక రాష్ట్ర బళ్లారి జిల్లా క్యారికల్లు సచివానందస్వామి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శివా యోగానంద స్వామిజీ ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భగవద్గీతలో శ్రీకృష్ణుడి శ్లోకాలను భక్తులకు వినిపించారు. భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు భహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సమీరా రెడ్డి, కుమార్ దొర, సిద్ధప్ప, శ్యాంప్రసాద్, కృష్ణమూర్తి, అడివప్ప, ముకుంద కృష్ణమూర్తి, విజయ్ గౌడ, సిద్ధారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎరిగేర వెంకోబ, కొల్లి రామకృష్ణ, శ్రీనివాసులు, గోపాల్, బండారి రంగస్వామి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.